క్లుప్తంగా

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



ఏలేశ్వరంలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న సంఘ అధ్యక్షుడు విజయ్‌బాబు

ఏలేశ్వరం: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని పర్యవరణ పరిరక్షణ సంఘం అధ్యక్షుడు ఎస్‌వీ జయబాబు అన్నారు. పట్టణంలో శుక్రవారం పర్యవరణ పరిరక్షణపై ముద్రించిన కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పర్యావరణాన్ని కాపాడడంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పర్యావరణంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఇంటింటికీ కరపత్రాలు పంపిణీ చేస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు అనసూరి నాగేశ్వరరావు, రౌతు సహదేవుడు, నారాయణరావు, కోట శ్రీనివాస చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో అన్నసమారాధనలు

తొండంగి: గణపతి నవరాత్రులను పురస్కరించుకుని మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం భారీగా అన్నసమారాధనలు నిర్వహించారు. గోపాలపట్నం, ఎ.కొత్తపల్లి, బెండపూడి, రావికంపాడు, పైడికొండ తదితర గ్రామాల్లో ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో అన్నసమారాధనలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అన్నప్రసాదం స్వీకరించారు.

హిందూ సంప్రదాయాన్ని కాపాడుకోవాలి

ఏలేశ్వరం: హిందూ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాలని గణేశ్ ఉత్సవ కమిటీ జిల్లా అధ్యక్షుడు వై.మాలకొండయ్య అన్నారు. మండలంలోని యర్రవరంలో గణపతిని శుక్రవారం ఆయన దర్శించుకుని ఉత్సవాల కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నిగ్రామాల్లో ఈ నెల 16న గణేశ్ నిమజ్జనాలు చేయాలన్నారు. ప్రపంచవ్యాప్తంగా హిందూ ధర్మానికి ప్రత్యేక స్థానం ఉందన్నారు. హిందూ ధర్మ పరిరక్షణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో కొల్లా శ్రీనివాస్, సింగిలిదేవి సత్తిరాజు, తుమ్మల పద్మజ, చక్రి, బి.సూరిబాబు పాల్గొన్నారు.

దసరా ఉత్సవాలకు రాట ముహూర్తం

గోకవరం: గ్రామంలో ప్రసిద్ధిగాంచిన దేవీచౌక్ ఆలయంలో శరన్నవరాత్ర ఉత్సవాలకు శుక్రవారం పందిరి రాట వేశారు. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఉదయం అటవీ ప్రాంతానికి వెళ్లి పందిరి రాటను తీసుకువచ్చారు. అనంతరం ఆలయ ప్రధాన అర్చకుడు డాక్టర్ వల్లూరి జగన్నాథశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి పందిరి రాట వేశారు. ఈ ఏడాది అమ్మవారి శరన్నవరాత్ర ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు.

నిత్యావసరాల పంపిణీ

కిర్లంపూడి: మండలంలోని భూపాలపట్నం, ఎస్.తిమ్మాపురం, శృంగరాయునిపాలెం గ్రామాల్లో వరద బాధితులకు శుక్రవారం ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ నిత్యావసర సరకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పెద్దాపురం ఆర్డీవో సీతారామారావు, ఎంపీపీ తోట రవి, జెడ్పీటీసీ సభ్యుడు తోట గాంధీ, చదరం చంటిబాబు తదితరులు పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో 3 రోజుల జైలు

కిర్లంపూడి: మండలంలో గత పది రోజుల్లో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేసి ఐదుగురిని అదుపులోకి తీసుకున్నట్టు ఎస్సై జి.సతీష్ తెలిపారు. శుక్రవారం వారిని ప్రత్తిపాడు జేఎఫ్‌సీఎం కోర్టులో హాజరు పరచగా ముగ్గురు వ్యక్తులకు రూ.10 వేల చొప్పున జరిమానా మరో ఇద్దరికి జరిమానాతో పాటు 3 రోజుల జైలు శిక్ష విధించినట్టు తెలిపారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

జగ్గంపేట: స్థానిక సున్ని జామియా మసీదు నూతన కార్యవర్గ ఎన్నిక శుక్రవారం జరిగింది. కమిటీ గౌరవాధ్యక్షుడిగా గఫూర్, ప్రెసిడెంట్‌గా ఎండీ ఆరిఫ్, వైస్ ప్రెసిడెంట్‌గా డాక్టర్ బాషా, సెక్రటరీగా షేక్ రెహమాన్, జాయింట్ సెక్రటరీగా ఎండీ ఇబ్రహీం, ట్రెజరర్‌గా షేక్ మొహిద్దీన్, కమిటీ సభ్యులుగా షేక్ వలి, కాజా మొహిద్దీన్, ఎండి కాజా, జానీ, ఖలీల్ తదితరులు ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గ సభ్యులను పలువురు అభినందించారు.

ఘనంగా గీతా పారాయణ

ఏలేశ్వరం: స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద వేంచేసిన దుర్గాదేవి ఆలయంలో శుక్రవారం పలు పారాయణలు నిర్వహించారు. విశ్వ హిందూ పరిషత్ మండల శాఖ అధ్యక్ష, కార్యదర్శులు ఏడీవీ ప్రసాద్, కటకం కిరిటీ ఆధ్వర్యంలో మహిళలు గీతాపారాయణ, విష్ణు సహస్ర నామ పారాయణ, లక్ష్మీఅష్టకం, గోవింద నామాలు పఠించారు. తూమురౌతు గురయ్య, ఉడతల రమణారావు పాల్గొన్నారు.

పేకాడుతున్న ఐదుగురి అరెస్ట్

జగ్గంపేట: మండలంలోని మల్లిశాల శివారులో రహస్యంగా నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై శుక్రవారం పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.10,200 స్వాధీనం చేసుకున్నట్టు స్థానిక ఎస్సై టి.రఘునాథరావు తెలిపారు.

వరద కష్టాలు ఫుల్.. వసతులు నిల్

- ఏలేశ్వరంలో కూలిన వంతెన
- నిలిచిపోయిన రాకపోకలు
- తీవ్ర ఇబ్బందులు పడుతున్న ప్రజలు



ఏలేశ్వరంలో పూర్తిగా కూలిపోయిన వంతెన

ఏలేశ్వరం: ఎంకి పెళ్లి సుబ్బి చావుకు వచ్చినట్టుగా మారింది పట్టణంలోని అప్పన్నపాలెం వాసుల పరిస్థితి. ఏలేరు కాలువపై వంతెన వరదలకు కూలిపోవడంతో మొత్తానికే మోసం వచ్చింది. మూడేళ్ల క్రితం వచ్చిన వరదలకు ఏలేరు కాలువపై వంతెన కుంగిపోయింది. దీంతో పట్టణ పరిధిలోని అప్పన్నపాలెం, జగ్గంపేట మండలంలోని పలు గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వంతెనపై కేవలం ద్విచక్ర వాహనాలే రాకపోకలు సాగిస్తుండగా ఇటీవల వచ్చిన వరదలతో వంతెన పూర్తిగా కూలిపోయింది. దీంతో అప్పన్నపాలెం వాసులు అర కిలోమీటరు దూరం ఉన్న ఏలేశ్వరం రావాలంటే సుమారు 15 కిలోమీటర్ల మేర తిరిగి రావాల్సి వస్తోంది.

తాగునీటికి ఇబ్బందులు

ఏలేరు వరదతో వంతెనను అనుకుని ఉన్న తాగునీటి పైపులైన్ ధ్వంసమైంది. దీంతో అప్పన్నపాలెం వాసులకు తాగునీటి కష్టాలు ప్రారంభమయ్యాయి. అప్పన్నపాలెంలో సుద్దనీరు వస్తుండడంతో ఏలేశ్వరం నుంచి పైపులైన్ ద్వారా తాగునీరు అందిస్తున్నారు. నగర పంచాయతీ అధికారులు ఆర్భాటంగా ఒక్కరోజే ట్యాంక్‌లతో తాగునీరు పంపించి చేతులు దులుపుకొన్నారు. దీంతో అప్పన్నపాలెం వాసులకు తాగునీరు లేక సుద్దనీటిపైనే ఆధార పడుతున్నారు.

రూ.40 లక్షలు వృథా

గత శివరాత్రికి ఏలేశ్వరంలో బ్రాహ్మణ రేవును రూ.40 లక్షలతో ఆధునీకరించారు. రేవులో మెట్లకు టైల్స్ వేయించారు. దీంతో పాటు రేవుకు ఇరువైపులా మెట్లు నిర్మించారు. ఇటీవల వచ్చిన వరదలకు మెట్లతో పాటు టైల్స్ శిథిలమయ్యాయి. ముందు చూపు లేకుండా నాసిరకం పనులు చేయడంతో ప్రభుత్వ సొమ్ము వృథాగా పోయిందని పలువురు విమర్శిస్తున్నారు.



బ్రాహ్మణరేవులో ధ్వంసమైన టైల్స్ వేసిన మెట్లు

వంతెన నిర్మించాలి



ఏలేరు కాలువపై కూలి పోయిన వంతెన స్థానంలో కొత్త వంతెన నిర్మించాలి. వంతెన లేకపోవడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. పక్కనే ఉన్న ఏలేశ్వరం రావాలంటే సుమారు 15 కిలో మీటర్ల మేర తిరిగి రావల్సి వస్తోంది. అధికారులు స్పందించి ప్రత్యామ్నాయ మార్గం చూపాలి.

– వింజరపు చిన్నయ్యదొర, అప్పన్నపాలెం

తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం



వంతెన కూలిపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. మహిళలు, పిల్లల కష్టాలు వర్ణనాతీతం. అప్పన్నపాలెం వాసులు ప్రతి పనికీ ఏలేశ్వరం రావాలి. విద్యాసంస్థలు, మార్కెట్ తదితర పనులకు అవస్థలు పడుతున్నాం. దీనిపై అధికారులు వెంటనే వంతెన నిర్మాణానికి చర్యలు తీసుకోవాలి.

– సుంకర వెంకన్నబాబు, అప్పన్నపాలెం

జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులకు సత్కారం



జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులను సత్కరించిన ఎంపీపీ సుంకర శ్రీవల్లి, వీరబాబు తదితరులు

గోకవరం: ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఇటీవల జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు పొందిన ఉపాధ్యాయులు, ఉద్యోగ విరమణ పొందిన పలువురు ఉపాధ్యాయులను శుక్రవారం ఎంపీపీ సుంకర శ్రీవల్లి, వైఎస్సార్ సీపీ నాయకుడు సుంకర వీరబాబు దంపతుల ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. స్థానిక ఎస్వీఆర్ ఫంక్షన్ హాలులో యూటీఎఫ్ మండల శాఖ సమక్షంలో నిర్వహించిన కార్యక్రమంలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలు బి.శ్రీనివాసరావు, ఎస్‌వీ సత్యనారాయణ, ఎ.జోగిరాజులతో పాటు ఇటీవల ఉద్యోగ విరమణ పొందిన ఉపాధ్యాయులు బద్దిరెడ్డి తాతాజీ, డి.అబ్బులు, జి.సత్యనారాయమూర్తి, జె.సత్యనారాయణ, ఎస్.ఉషాదేవి దంపతులను పూలమాలలు, శాలువాలతో సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు దాసరి తమ్మన్నదొర, వరసాల ప్రసాద్, దాసరి చినబాబు, సుంకర రమణ, బత్తుల సత్తిబాబు, వైస్ ఎంపీపీ మడికి మైనరబాబు, పులపర్తి బుజ్జి, ఇనకోటి బాపన్నదొర, యూటీఎఫ్ మండలాధ్యక్షుడు ఆర్.హరనాథ్ తదితరులు పాల్గొన్నారు.

కొత్త ఆవిష్కరణలతోనే గుర్తింపు



విద్యార్థులు చేసిన ప్రాజెక్టును పరిశీలిస్తున్న అతిథులు

గండేపల్లి: వినూత్న ఆలోచనలకు సృజనాత్మకతను జోడించి కొత్త ఆవిష్కరణలు చేసినప్పుడే ఇంజినీర్‌గా జీవితానికి ఒక సార్థకత ఉంటుందని క్రీఫీ ఎండీ, సీఈఓ కొవ్వూరి కృష్ణారెడ్డి అన్నారు. సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీలో శుక్రవారం ప్రారంభమైన ఆదిత్య పోలీ వేద–2024 కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దశాబ్దాలు గడిచినా ఇంజినీర్ మోక్షగుండం విశ్వేశరయ్యను భారత్‌తో పాటు టాంజానియా, శ్రీలంక ప్రజలు స్మరించుకుంటారన్నారు. కేఎల్ రావు, సర్ ఆర్థర్ కాటన్ వంటి మహనీయులు తమ ఆలోచనలకు పదును పెట్టి సమాజ అభివృద్ధికి తోడ్పటంతోనే నేటికీ మన హృదయాల్లో జీవించే ఉన్నారన్నారు. వేద పేరిట జాతీయస్థాయి టెక్‌ఫెస్ట్‌ను గత 16 ఏళ్లగా నిర్వహిస్తున్నామని, ఈ ఏడాది 7500 మంది విద్యార్థులు రిజిస్టర్ కావడం ఆనందంగా ఉందని డిప్యూటీ చాన్సలర్ ఎం.శ్రీనివాసరెడ్డి తెలిపారు. కాకినాడ సబ్ డివిజనల్ ఇంజనీర్ కె.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ముంపు గ్రామాల్లో చురుగ్గా పారిశుధ్య పనులు



ఎస్‌ఆర్‌పాలెంలో బ్లీచింగ్ చల్లుతున్న పంచాయతీ కార్మికుడు

కిర్లంపూడి: మండల పరిధిలోని ముంపు గ్రామాల్లో పారిశుధ్య పనులు జోరుగా సాగుతున్నాయి. ఏటి పట్టు గ్రామాల్లో వరద ఉధృతి కారణంగా చెత్త, వ్యర్థాలు పేరుకుపోయాయి. గత రెండు రోజుల నుంచి ఆయా గ్రామాల్లో వరదనీరు పూర్తిగా తగ్గడంతో అధికారులు పారిశుధ్య పనులను ముమ్మరం చేశారు. పలు గ్రామాల్లో శుక్రవారం పారిశుధ్యం సిబ్బంది వ్యర్థాలు తొలగించి బ్లీచింగ్ చల్లారు. ఈ సందర్భంగా ఈఓపీఆర్డీ సత్యప్రసాద్ మాట్లాడుతూ మండలంలోని వరద ముంపు గ్రామాలైన రాజుపాలెం, భూపాలపట్నం, ముక్కొల్లు, శృంగరాయునిపాలెం, ఎస్.తిమ్మాపురం, వేలంక గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుకు ప్రత్యేక చర్యలు చేపట్టామన్నారు. పంచాయతీ కార్యదర్శుల పర్యవేక్షణలో వరద కారణంగా పేరుకుపోయిన చెత్త, వ్యర్థాలు తొలగించి బ్లీచింగ్, దోమల నివారణ మందు పిచికారీ చేస్తున్నట్టు తెలిపారు.

ఆయిల్‌పామ్ సాగుతో ఆర్థికాభివృద్ధి

- ఐదేళ్లలో 10,700 హెక్టార్లలో విస్తరణకు ప్రణాళిక
- జిల్లా ఉద్యాన అధికారి మల్లికార్జునరావు



రైతులకు ఉచితంగా ఆయిల్‌పామ్ మొక్కలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే దివ్య, ఏడీహెచ్ మల్లికార్జునరావు

తుని రూరల్: ఆయిల్‌పామ్ తోటల సాగుతో ఆర్థికాభివృద్ధి మెరుగుపడుతుందని, అందుకు అనువుగా సాగు విస్తీర్ణాన్ని పెంచాలని జిల్లా ఉద్యాన అధికారి ఎన్.మల్లికార్జునరావు అన్నారు. తుని మండలం డి.పోలవరంలోని పతంజలి ఫుడ్స్ లిమిటెడ్ నర్సరీలో శుక్రవారం ఉద్యాన అధికారి గుత్తుల విజయలక్ష్మి ఆధ్వర్యంలో ఆయిల్‌పామ్ తోటల విస్తరణ మహోత్సవం నిర్వహించారు. ఎమ్మెల్యే యనమల దివ్య ముఖ్య అతిథిగా పాల్గొని రైతులకు ఉచితంగా ఆయిల్ పామ్ మొక్కలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డీహెచ్‌ఓ మల్లికార్జునరావు మాట్లాడుతూ నిలకడగా ఆదాయాన్నిచ్చే ఆయిల్‌పామ్ సాగుతో రైతు కుటుంబాలకు ఆర్థిక స్వావలంబన కలుగుతుందన్నారు. రానున్న ఐదేళ్లలో కాకినాడ జిల్లాలో 10,700 హెక్టార్లలో ఆయిల్‌పామ్ తోటలు విస్తరించేందుకు వికసిత్ భారత్ ద్వారా ప్రణాళిక రూపొందించామన్నారు. రైతులను ప్రోత్సహించేందుకు ఉచితంగా మొక్కలు అందించడం, హెక్టారుకు రూ.5250 చొప్పున నాలుగేళ్ల ఎరువుల రాయితీ, సన్నచిన్నకారు రైతులకు 90 శాతం రాయితీపై బిందు సేద్యం పరికరాలు అందిస్తుందన్నారు. ఆయిల్ పామ్ సాగుకు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని అనుసంధానం చేసి రూ.లక్ష విలువ చేసే పని దినాలు కల్పిస్తున్నట్టు ఆయన వివరించారు. తక్కువ పెట్టుబడితో నిలకడగా లాభాలు పొందే ఆయిల్‌పామ్ గెలల సేకరణ బాధ్యత పతంజలి సంస్థ తీసుకుంటుందని ఆ సంస్థ ఏజీఎం పట్టాభిరామిరెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రాజా అశోక్‌బాబు, తాండవ షుగర్స్ మాజీ చైర్మన్ సుర్ల లోవరాజు, మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్టు డైరెక్టర్ వరప్రసాద్, పతంజలి ఫుడ్స్ సంస్థ ప్రతినిధులు, తుని, తొండంగి, కోటనందూరు మండలాల రైతులు పాల్గొన్నారు.

డ్రోన్ టెక్నాలజీతో విప్లవాత్మక మార్పులు



సిరిపురంలో డ్రోన్ వినియోగంపై అవగాహన కల్పిస్తున్న ఏఓ జ్యోతి

ఏలేశ్వరం: వ్యవసాయ రంగంలో డ్రోన్ టెక్నాలజీతో విప్లవాత్మక మార్పులు వస్తాయని మండల వ్యవసాయాధికారి బి.జ్యోతి అన్నారు. మండలంలోని సిరిపురంలో శుక్రవారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. డ్రోన్ టెక్నాలజీపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులకు ద్రవరూప ఎరువులు, పురుగు మందుల పిచికారీ చేయడం డ్రోన్ ద్వారా సులభతరం అవుతుందన్నారు. చిన్న డ్రోన్లను రైతులకు అందుబాటులోకి తెచ్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. డ్రోన్ ద్వారా ఒకరోజు 80 నుంచి 100 ఎకరాలకు మందులు పిచికారీ చేయవచ్చన్నారు. రైతులు డ్రోన్ సాంకేతికను వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ పీతల సూకరాజు, ధనేకుల వీరభద్రరావు, సంగన ప్రభోజీ వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

ముంపు పొలాల పరిశీలన

కిర్లంపూడి: వరదల కారణంగా పంటలు నష్టపోయిన ప్రతి రైతుకూ నష్ట పరిహారం అందుతుందని మండల ఏఓ జోకా అమృత అన్నారు. మండలంలోని నీట మునిగిన వరి పంటలను శుక్రవారం ఆమె పరిశీలించారు. వర్షాలకు పంట నష్టపోయిన రైతుల జాబితాను తయారు చేస్తున్నామన్నారు. పంటలు నీట మునిగిన రైతులు పాస్‌బుక్, బ్యాంక్ అకౌంట్, ఆధార్ కార్డు జెరాక్స్‌లతో సేవా కేంద్రాలకు వెళ్లి వివరాలు నమోదు చేయించుకోవాలని సూచించారు.

ఆ గ్రామాల్లోనూ అభివృద్ధి పనులు

- మండల సమావేశంలో తీర్మానం
- ఏకగ్రీవంగా ఆమోదించిన సభ్యులు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ రాము

తుని రూరల్: రెండు దశాబ్దాలుగా పంచాయతీ ఎన్నికలు నిర్వహించని, ఆ నాలుగు పంచాయతీల్లోనూ అభివృద్ధి పనులు కొనసాగించాలని ప్రజాప్రతినిధులు ఏకగ్రీవంగా తీర్మాణం చేశారు. తుని మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఎంపీపీ డాక్టర్ బొప్పన రాము అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వైస్ ఎంపీపీ చోడిశెట్టి సత్యనాగేశ్వరరావు మాట్లాడుతూ మేజర్ పంచాయతీ ఎస్.అన్నవరంతో పాటు రేఖవానిపాలెం, కుమ్మరిలోవ, తాళ్లూరు గ్రామాలను గతంలో తుని పురపాలక సంఘంలో విలీనం చేస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం మధ్యంతరంగా నిలిచిపోయిందన్నారు. అప్పటి నుంచి సర్పంచులు, వార్డు మెంబర్లు లేకపోవడంతో ప్రత్యేక అధికారుల పాలన సాగుతోందన్నారు. దీంతో ఆర్థిక సంఘం నిధులు ఆ నాలుగు గ్రామాలకు విడుదల కావడం లేదన్నారు. దీంతో అభివృద్ధి కుంటు పడుతోందన్నారు. నాలుగు గ్రామాలకు ఆర్థిక సంఘం నిధులు, కలెక్టర్ ప్రత్యేక గ్రాంటు విడుదల చేయాలని కోరుతూ తీర్మాణం చేశారు. తుని నుంచి హెచ్.కొత్తూరు, తుని నుంచి కుమ్మరిలోవ, కొలిమేరు, ఎన్.సూరవరం రూట్లలో ఆర్టీసీ బస్సులు నడపాలని సభ్యులు విజ్ఞప్తి చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం రైతులకు రూ.20 వేల పెట్టుబడి సాయం ఇవ్వాలని, స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను అడ్డుకోవాలని సభ్యులు తీర్మాణాలు చేశారు. వ్యవసాయ, వైద్యశాఖ, సాగునీటి పారుదల, పంచాయతీ రాజ్‌శాఖలపై సమీక్షించారు. ఎంపీడీఓ పి.రవికుమార్, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, అధికారులు పాల్గొన్నారు.

మూగజీవాలకు రక్షణగా రేడియం రిబ్బన్లు



గోకవరంలో ఆవుల మెడలో రేడియం రిబ్బన్లు వేస్తున్న జెడ్పీటీసీ మాజీ సభ్యుడు బోసుబాబు

గోకవరం: గ్రామంలో ప్రధాన రహదారిపై సంచరిస్తున్న ఆవులు, ఇతర మూగజీవాలకు రక్షణగా జెడ్పీటీసీ మాజీ సభ్యుడు పాలూరి బోసుబాబు రేడియం రిబ్బన్లు ఏర్పాటు చేశారు. ఇటీవల కాలంలో ఆవులు రాత్రి సమయంలో ప్రధాన రహదారిపై సంచరిస్తుండటంతో వాటిని గుర్తించలేక పలువురు ప్రమాదాల బారిన పడ్డారు. ఈ ప్రమాదంలో పశువులు సైతం గాయపడుతున్నాయి. ఈ సమస్య పరిష్కారం కోసం ఆయన వినూత్నంగా ఆలోచించి రాత్రి సమయంలో ప్రధాన రహదారిపై ఉన్న పశువులను గుర్తించే విధంగా వాటి మెడలో శుక్రవారం రేడియం రిబ్బన్లు వేశారు. దీంతో పలువురు హర్షం వ్యక్తం చేశారు.

సౌకర్యాల కల్పనకు సహకరించాలి

గండేపల్లి: గ్రామాల్లో ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు అధికారులు సహకరించాలని జెడ్పీ మాజీ చైర్మన్ జ్యోతుల నవీన్ కోరారు. జగ్గంపేట రావులమ్మనగర్‌లో శుక్రవారం పంచాయితీ పరిధిలోని 4 సచివాలయాల సిబ్బందితో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. గ్రామంలో పారిశుధ్యం, మంచినీటి సరఫరా, వీధి లైట్లు, విద్యుత్ తదితర సమస్యలపై చర్చించారు. ప్రజలకు సౌకర్యాలు కల్పించాలని సూచించారు.

బాధితులను ఆదుకుంటాం

తుని: వరద బాధితులను ప్రభుత్వం అన్నివిధాలా ఆదుకుంటుందని ఎమ్మెల్యే యనమల దివ్య అన్నారు. తాండవ నది ఉధృతి కారణంగా ముంపునకు గురైన స్థానిక రెల్లి కాలనీని మాజీ ఎమ్మెల్యే రాజా అశోక్‌బాబుతో కలిసి శుక్రవారం ఆమె సందర్శించారు. ముంపు బాధితులను పరామర్శించి ధైర్యం చెప్పారు. ప్రభుత్వ పరంగా సమకూర్చిన నిత్యావసరాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దివ్య మాట్లాడుతూ రెల్లికాలనీ ముంపు బారిన పడకుండా అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మపర్సన్ కుఛమంచి శోభారాణి, మళ్ల గణేష్, బంగారు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సీపీఆర్‌పై అవగాహన



ఆదిత్యలో సీపీఆర్‌పై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న వైద్యులు

గండేపల్లి: కార్డియో పల్మనరీ రెసస్‌టేషన్ (సీపీఆర్)తో వ్యక్తుల ప్రాణాలను కాపాడవచ్చునని డెల్టా హాస్పటల్స్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ కె.నాగేశ్వరరావు, డీజీఎం గుమ్మాల శివ ప్రసాద్ అన్నారు. మండలంలోని సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీలో ఫార్మసీ విద్యార్థులకు సీపీఆర్‌పై శుక్రవారం అవగాహన, శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అత్యవసర పరిస్థితుల్లో సీపీఆర్ చేయడం ఎంత ముఖ్యమన్నారు. సీపీఆర్ సమయంలో చేయాల్సిన పనులు, చేయకూడని వాటిపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డి.సతీష్ కుమార్, అధ్యాపకులు, ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ లోత పరిణయశ్రీ తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం



గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందజేస్తున్న అధికారులు

శంఖవరం: గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారంతోనే ఆరోగ్యం సాధ్యమని ఐసీడీఎస్ సీడీపీఓ పద్మావతి అన్నారు. పౌష్టికాహార వారోత్సవాల్లో భాగంగా మండలంలోని వజ్రకూటంలో గర్భిణులకు శుక్రవారం పౌష్టికాహారం అందించారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ ప్రభుత్వం గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు నెలకు సరిపడ్డ పౌష్టికాహారం అందిస్తుందన్నారు. తల్లి ఆరోగ్యంగా ఉంటేనే పిల్లలు ఆరోగ్యంగా జన్మనిస్తారన్నారు. ప్రతిఒక్కరూ ఆర్యోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు.

సీతారాం ఏచూరి మృతి పార్టీకి తీరని లోటు



ప్రత్తిపాడులో ఏచూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

ప్రత్తిపాడు రూరల్: సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మృతి పార్టీకి తీరని లోటు అని ఆ పార్టీ మండల కార్యదర్శి రొంగల ఈశ్వరరావు అన్నారు. ప్రత్తిపాడు సంత మార్కెట్ వద్ద సీపీఎం మండల శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఈశ్వరరావు మాట్లాడుతూ సీతారాం ఏచూరి మృతి పార్టీ శ్రేణులను తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసిందన్నారు. పార్టీకి ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో శివ, దుర్గ, సతీష్‌కుమార్, సత్యనందం తదితరులు పాల్గొన్నారు.

విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలి



ఎంపీడీఓ కుమార్‌బాబుకు వినతిపత్రం అందజేస్తున్న సచివాలయ సిబ్బంది

ప్రత్తిపాడు రూరల్: తమ విధులకు ఆటంకం కలిగించి భయభ్రాంతులకు గురి చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని చింతలూరు గ్రామ కార్యదర్శి లొండ గంగాధరరావు, సచివాలయ ఉద్యోగులు కోరారు. ఈ మేరకు శుక్రవారం ఎంపీడీఓ ఎంవీఆర్ కుమార్ బాబుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చింతలూరు గ్రామానికి చెందిన మాసా అర్జున్‌కుమార్ తామ విధులకు ఆటంకం కలిగిస్తూ తమను వేధిస్తున్నాడని తెలిపారు. అతనిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సచివాలయం ఉద్యోగులు పాల్గొన్నారు.

ఆర్డీఓ పర్యటన



పెరుమాళ్లపురంలో పర్యటించిన ఆర్డీఓ సీతారామారావు, రెవెన్యూ అధికారులు

తొండంగి: మండలంలోని పెరుమాళ్లపురంలో శుక్రవారం పెద్దాపురం ఆర్డీఓ సీతారామారావు పర్యటించారు. ఇటీవల కురిసిన కుండపోత వర్షాలకు దెబ్బతిన్న ఇళ్లను పరిశీలించి ఎన్యూమరేషన్ నిర్వహించారు. వర్షాలకు దెబ్బతిన్న ఇళ్లకు కచ్చితంగా నష్టపరిహారం అందించేందుకు నివేదిక అందించాలని అధికారులకు సూచించారు. కోదాడ, పెరుమాళ్లపురం ఇతర ముంపు గ్రామాల్లో రెవెన్యూ అధికారులు సర్వేచేసి వివరాలు నమోదు చేయాలన్నారు. ఆయన వెంట తహసీల్దార్ మొరార్జీ, వీఆర్వోలు ఉన్నారు.

అరుణాచలానికి ఆర్టీసీ బస్సు

తుని: తమిళనాడులోని ప్రముఖ పుణ్యక్షేత్రం అరుణాచలానికి ఈ నెల 16న ప్రత్యేక ఆర్టీసీ సర్వీసు నడుపుతున్నట్లు స్థానిక ఆర్టీసీ డిపో మేనేజర్ ఎన్.కిరణ్‌కుమార్ శుక్రవారం తెలిపారు. ఆ రోజు ఉదయం 10 గంటలకు బస్సు తునిలో బయలుదేరి విజయవాడ చేరుకుంటుందన్నారు. దుర్గమ్మ దర్శనానంతరం శ్రీకాళహస్తి, కాణిపాకం, శ్రీపురం, అరుణాచలం, కంచి యాత్రల అనంతరం తిరిగి తుని చేరుకుంటుందన్నారు. టిక్కెట్టు ధర ఒక్కొక్కరికి రూ. 3,500గా నిర్ధారించినట్టు తెలిపారు.

వనదుర్గ అమ్మవారికి చండీ హోమం

అన్నవరం: రత్నగిరిపై వనదుర అమ్మవారికి శుక్రవారం చండీహోమం నిర్వహించారు. పండితులు ఉదయం తొమ్మిది గంటలకు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి హోమం ప్రారంభించారు. 11 గంటలకు హోమగుండంలో హోమద్రవ్యాలు సమర్పించి పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం అమ్మవారికి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. అర్చకులు కోట వంశీ, ఫణి, కె.ప్రసాద్ హోమం నిర్వహించారు. 30 మంది భక్తులు రూ.750 చొప్పున టిక్కెట్లు కొనుగోలు చేసి హోమంలో పాల్గొన్నారు.

అమ్మవార్లకు ప్రత్యేక పూజలు

సత్యదేవుని ప్రధానాలయంలో అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారికి ప్రధానార్చకుడు కోట సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో పండితులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు.